ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587.70 (305.9222)	95,761	40,810
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.30 (3.52)	8,773	12,111
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.78 (43.88)	57,482	57,482

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.176	స్కిన్‌లెస్ : రూ.200

వసూల్ రాజా



- ఆ ఠాణా బాస్ దెబ్బకు హడలెత్తుతున్న బాధితులు
- ఫిర్యాదు తీసుకోవాలన్నా, కేసు పెట్టాలన్నా డబ్బులివ్వాల్సిందే
- రాజకీయనాయకులతో సంబంధాలు, అక్రమదందాలకు అండ
- ప్రైవేట్ సెటిల్‌మెంట్లు
- సివిల్ వ్యవహారాలు చక్కబెట్టడంలోనే సారు దృష్టి

ఆ ఎస్ఐ అక్రమార్జనకు అంతులేకుండా పోయింది. స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవాలన్నా, కేసు పెట్టాలన్నా ముడుపులివ్వాల్సిందే. అధికార, ప్రతిపక్షం తేడాలేకుండా ఛోటా నాయకులతో చెట్టపట్టాలేసుకొని వారి అక్రమ దందాలకు సహకరిస్తూ, తన అక్రమ వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్న ఈ ఠాణా బాస్ వైఖరిపై అటు పోలీసువర్గాల్లో ఇటు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. స్టేషన్‌లో అడుగుపెట్టింది మొదలు ఇంటికి వెళ్లేంతవరకు ప్రతీ వ్యవహారంలో చేతులు తడిపితే తప్ప కేసుని ముందుకు వెళ్లనీయని వైఖరిపై తోటిపోలీసులే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

అక్రమ రేషన్ దందాలు, ఇసుక రవాణా తదితర వ్యవహారాల్లో నెలవారీ మామూళ్లు పొందడమేగాక స్టేషన్‌కు వచ్చే ఏ ఫిర్యాదుపైన విచారణ చేయాలన్నా ముడుపులు ఇస్తే తప్ప విచారణ చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందని, బాధలు తీరుస్తారనే విశ్వాసంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా, ఇక్కడి బాస్ మాత్రం వారి నమ్మకానికి తిలోదకాలిస్తూ అడ్డగోలుగా ముడుపులు తీసుకుంటుండటంతో బాధితులు భయపడుతున్నారు. డబ్బులొచ్చే పనైతే సివిల్ వ్యవహారమైనా సరే ముందుండి సెటిల్‌మెంట్ చేస్తున్నారని, అదే పైసలు రాని పనైతే పట్టించుకోకుండా పక్కనపడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్ పరిధిలో ఇటీవల 30 వరకు వ్యవసాయ మోటర్లు చోరీ అయిన విషయంలో ఫిర్యాదులు రాగా, ఈ కేసు విచారణ కనీస పురోగతికి నోచుకోవడం లేదు. ఈయన గతంలో పనిచేసిన చోట ఒక బాధితుడు ఏసీబీకి పట్టించేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా, విషయాన్ని పసిగట్టి సదరు బాధితుడితో ఒప్పందం చేసుకొని బయటపడినా, వైఖరిలో మాత్రం మార్పురాలేదు. పైగా మరింతగా రెచ్చిపోయి పైసలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మిర్యాలగూడ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని ఓ స్టేషన్ పోలీస్ బాస్ వ్యవహారశైలి ఆ శాఖ ప్రతిష్ఠను దిగజార్చుతున్న వైఖరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పైసలిస్తే ఏ పనైనా చక్కబెట్టేస్తారు

ఈ ఎస్ఐ సదరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ఓ ఉద్యోగిని ముందు పెట్టి సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే బాధలు తీర్చి, ఉపశమనం కలిగిస్తారని వెళితే, అక్కడ ముడుపులకోసం పీక్కుతింటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేషన్‌కు సగటున రోజుకు 25 నుంచి 30 వరకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక్కడ స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే కనీసం రూ.10వేలు ముట్టజెప్పాల్సిందేనని సదరు బాస్ డిమాండ్ చేస్తున్నట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ స్టేషన్ పరిధిలో ఓ భూవివాదంలో (సివిల్) జోక్యం చేసుకున్న ఈ బాస్ ఇరువర్గాల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేసి సెటిల్‌మెంట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చవద్దని స్పష్టమైన ఆదేశాలున్నా ఇక్కడ సెటిల్‌మెంట్లు చేస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల స్టేషన్ పరిధిలో జాతీయరహదారిపై గొర్రెల మందను కారు ఢీకొట్టిన ఘటనలో గొర్రెలను ఢీకొట్టిన కారు యజమానితో పాటు, దాన్ని వెనకనుంచి ఢీకొట్టిన మరో కారు యజమాని నుంచి సైతం ప్రమాదానికి కారే కారణమని బెదరించి రూ.20వేలు వసూలు చేశారని పోలీస్‌వర్గాల్లోనే చర్చ సాగుతోంది. అధికార పార్టీకి చెందిన ఛోటానాయకులను, స్థానిక ప్రతిపక్ష నాయకులను సైతం తన బుట్టలో వేసుకున్న ఈ ఎస్ఐ అక్రమ ఇసుకరవాణాకు అండగా ఉండి దందా సాఫీగా సాగేలా చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల యజమానులు, ఇసుక అక్రమంగా తవ్వుతున్న వారితో కుమ్మక్కై ఎవరి వాటాలు వారు సక్రమంగా తీసుకునేలా ఎస్ఐ మధ్యవర్తిత్వం వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఈ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో చోరీ సొమ్మును రికవరీ చేసి కోర్టుకు డిపాజిట్ చేయగా, కేసు ముగిసిన తర్వాత కోర్టు నుంచి బాధితులకు వచ్చిన నగలు రోల్డ్ గోల్డ్‌వి ఉండడంతో సదరు బాధితులు స్టేషన్‌కు వచ్చి నిలదీశారు. విషయం బయటికి పొక్కకుండా లోలోపల మేనేజ్ చేశారని పోలీసువర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల స్టేషన్‌కు వచ్చిన ఒక దాడి కేసులో ఫిర్యాదుదారులు ఇచ్చిన పేర్లలో ఒకరి పేరును తొలగించేందుకు రూ.లక్ష డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు అవాక్కయ్యాడని, అంత ఇచ్చుకోలేనని తగ్గించాలని బతిమాలుడుకున్నా వినలేదని తెలిసింది. ఆయన గతంలో పనిచేసిన ఓ స్టేషన్‌లో అక్రమ సంబంధం కేసులో ఉన్నతవర్గానికి చెందిన వ్యక్తి అవివాహితను గర్భవతిని చేసి వదిలేయడంతో ఆమె తనకు న్యాయం చేయాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారి కాస్తా ఈ వ్యవహారాన్ని ప్రైవేట్ సెటిల్‌మెంట్ చేశారు. బాధితురాలికి రూ.12లక్షల పరిహారం ఇచ్చేలా ఒప్పించి, ఈ వ్యవహారంలో కేసు లేకుండా చేసినందుకు రూ.3లక్షల వరకు తీసుకున్నట్టు అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయితే బాధితురాలికి ఇప్పటికీ సదరు పంచాయితీ ప్రకారం పరిహారం ఇవ్వకపోవడంతో ఆమె బంధువులు ఇటీవల స్టేషన్‌కు వచ్చి సారుని కలిసి తమ పరిస్థితేంటని అడగ్గా, మళ్లీ ఒకసారి మాట్లాడి హెచ్చరిస్తానని వారికి సర్దిజెప్పినట్లు తెలిసింది. ఇలా పోలీస్‌బాస్ ఇష్టారీతిగా వ్యవహరిస్తుండడంతో పోలీస్ శాఖ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఇప్పటికైనా సదరు సారు వ్యవహారాలను కట్టడి చేయాలని పలువురు బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

బడి, గుడి రెండూ సమానమే



ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యేలు

- ఉపాధ్యాయులు పట్టుదలతో పనిచేయాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నల్లగొండ/నల్లగొండ టౌన్, సెప్టెంబరు 5: బడి, గుడి రెండు సమానమేనని, ఉపాధ్యాయులు దేవుళ్లుగా మారి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు పట్టుదలతో పనిచేస్తే సమాజానికి ఆణిముత్యాల లాంటి పౌరులను తయారు చేయవచ్చని అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ఇటీవల ప్రభుత్వ విద్యా వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయని, కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉందని, ఇలాంటి పరిస్థితులు మారాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యావ్యవస్థ అభివృద్ధికి కృషిలో భాగంగా కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలతో పాటు, ఇటీవల బొట్టు గూడ పాఠశాల నూతన భవనానికి ఫౌండేషన్ తరఫున నిర్మిస్తున్నట్టు చెప్పారు. కవి, రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేలా ఉపాధ్యాయులు మారాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో పబ్లిక్ స్కూళ్లలో సీట్లు దొరకడం లేదని, ఇక్కడి పాఠశాలలు కూడా అలా రూపొందాలన్నారు. విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని, అందుకు సామాజిక బాధ్యతగా పనిచేయాలని, డిజిటల్ విద్యా వ్యవస్థకు కృషి చేయాలన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, ఆర్డీవో రవి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీఈవో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.



జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



వేములపల్లి : వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, దామరచర్ల, వేములపల్లి, సెప్టెంబరు 5: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, నష్టం వివరాలను రైతులు వ్యవసాయాధికారులకు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మాడ్గులపల్లి మండలంలోని పూసలపాడు, దామరచర్ల మండలంలోని వాడపల్లి, వేములపల్లి మండలంలోని ఎరుకలగుట్ట, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టం జరిగిన రైతులు అధైర్యపడకుండా వ్యవసాయాధికారులకు వివరాలు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారులు పంటలను సందర్శించి నష్టం వివరాలతో అంచనా రూపొందిస్తారని అన్నారు. అనంతరం రూ.2లక్షల రుణమాఫీకి అర్హులైన రైతు కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వ్యవసాయాధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో శివరామ్‌కుమార్, ఏఈవో వేణుగోపాల్, కంపసాగర్ శాస్త్రవేత్తలు పల్లవి, రాములమ్మ, ఏవో ఉమారాణి, ఏఈవో పార్వతి, రుషేంద్రమణి, ఏఈవోలు మల్సూర్, రైతులు పేరాల గురువారావు, శ్రీనివాస్‌రావు, వల్లంపట్ల ప్రవీణ్, జానకిరాములు, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, అంజయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ● బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న నారాయణ అమిత్

మిర్యాలగూడ, సెప్టెంబరు 5: మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా ఎం.నారాయణ అమిత్ గురువారం బాధ్యతలు చేపట్టారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అమిత్ రెండేళ్లపాటు వికారాబాద్‌లో ప్రొబెషన్ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్‌లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని అన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. గత ఆర్డీవో శ్రీనివాసరావు 'ధరణి' సమస్యలు పరిష్కరించడంలో, పెండింగ్ దరఖాస్తులు తగ్గించడంలో చాలా కృషి చేశారని అన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మార్గదర్శకత్వంలో అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బదిలీపై వెళ్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా, తమను తండ్రిలా చూసుకున్నందుకు కృతజ్ఞతతో ఉంటామని సిబ్బంది రోదించటంతో బదిలీ అయిన ఆర్డీవో శ్రీనివాసరావు సైతం కన్నీరు పెట్టుకున్నారు. ఆయన కార్యాలయం నుంచి బయటకు రాగానే కార్యాలయ అటెండర్లు, సహాయకులు ఆలింగనం చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. తమను తండ్రిలా చూసుకున్నందుకు కృతజ్ఞతగా ఉంటామనడంతో ఆర్డీవో భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. ఐదు నెలల కాలంలో డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న 6వేల పైచిలుకు ధరణి దరఖాస్తులు, వెయ్యికి పైగా తగ్గించడంలో ఆయన కీలకంగా పనిచేశారు.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- పీఎస్‌ల పరిధిలో ప్రతిరోజూ గంజాయి టెస్టులు
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 5: జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి తాగుతూ పట్టుబడిన 130 మంది యువతకు వారి తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా కేంద్రంలో గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి తాగుతున్న యువతను సక్రమ మార్గంలో పెట్టేందుకు మిషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామన్నారు. ప్రతీ రోజు అన్ని పీఎస్ పరిధిలో గంజాయి టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. పట్టుబడిని వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసై బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయిని ఒక్కసారి తీసుకుంటే ఆరు నెలల వరకు దాని ప్రభావం శరీరంలో ఉంటుందన్నారు. ప్రస్తుతం కౌన్సెలింగ్ తీసుక్ను వారికి మళ్లీ ఒకటి రెండు సార్లు టెస్ట్ చేస్తామన్నారు. మరోమారు పట్టుబడితే జైలు తప్పదని హెచ్చరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, సరఫరా చేసినా, తాగినా డయల్ 100, వాట్సప్ నెంబర్ 8712670266కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ కరుణాకర్, వీరబాబు, నాగరాజు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : ఎస్పీ

దామరచర్ల: పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దు వెంట గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘాను పటిష్ఠం చేయాలన్నారు. దొంగతనాలు జరగకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్ఐ శేఖర్, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 5: వరద బాధితులకు ఉద్యోగుల పక్షాన అండగా ఉంటామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. టీఎన్జీవోస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రజల జీవనం అస్తవ్యస్తమైందన్నారు. ఉద్యోగులు వారి ఒక రోజు మూల వేతనాన్ని వరద బాధితుల సహాయ నిధికి విరాళంగా ఇచ్చేందుకు రాష్ట్ర జేఏసీ తీసుకున్న నిర్ణయానికి జిల్లా ఉద్యోగులంతా మద్దతు ప్రకటించారన్నారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు స్వచ్ఛందంగా ప్రజలకు సహాయం చేసే విషయంలో ఉద్యోగులు ముందుంటారన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.



డీసీసీబీ ఏటీఎంను ప్రారంభిస్తున్న చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీని అగ్రస్థానంలో నిలుపుతాం

చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 5: అధికారులు, ఉద్యోగులు, పీఏసీఎస్ చైర్మన్ల సహకారంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుతామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం డీసీసీబీలో నూతన భవనంతో పాటు ఏటీఎంను, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన మేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.150కోట్ల దీర్ఘకాలిక రుణాలను వేగవంతంగా పంపిణీ చేస్తామన్నారు. రూ.100కోట్ల గ్రామీణ, పట్టణ హౌసింగ్ రుణాలు, రూ.50కోట్ల వాహన రుణాలను అందజేస్తామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.450కోట్లకుపైగా రుణాలు మంజూరు చేయడంపై బ్యాంకు అధికారులను, ఉద్యోగులను అభినందించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీకి సంబంధించి రూ.279కోట్లకు రూ.250కోట్ల మాఫీని పూర్తి చేశామన్నారు. మిగతా రుణాలను కూడా త్వరలో మాఫీ చేస్తామన్నారు. ఎన్ఎల్ఎం పథకం సబ్సిడీ సైతం అందజేస్తామన్నారు. ప్రస్తుతం డీసీసీబీ రూ.2,300కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతోందని, త్వరలో రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్తామన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు విస్తృతం చేసేందుకు 37 బ్రాంచ్‌లు ఉండగా, కొత్తగా ఇటీవల ఆరు బ్రాంచ్‌లు మంజూరయ్యాయని, మరో ఐదు బ్రాంచ్‌లు కూడా మంజూరు కానున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, లింగయ్యయాదవ్, సీఈవో శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మదర్ డెయిరీ నామినేషన్ల పరిశీలన



ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలోని ఆరు డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఎన్నికలకు బుధవారం 21మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 15మంది నామినేషన్లు వేయగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరు మంది నామినేషన్లు వేశారు. గురువారం మదర్ డెయిరీ కార్యాలయంలో ఎన్ని కల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా 21 నామినేషన్లు సవ్యం ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి.

పార్టీ అభివృద్ధికి రాములు సేవలు శ్లాఘనీయం

విగ్రహావిష్కరణ సభలో త్రిపుర రాష్ట్ర గవర్నర్



నల్లగొండలో ఓరుగంటి రాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

రామగిరి, సెప్టెంబరు 5: పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సేవలు శ్లాఘనీయమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓరుగంటి రాములు సంస్మరణ సభ, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రాములు జీవితాంతం పార్టీ అభివృద్ధికి, దేశ రక్షణ, హిందూ ధర్మం కోసం పనిచేశారన్నారు. జనసంఘ్ కార్యకర్తగా అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడన్నారు. 1981లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి మునిసిపల్ చైర్మన్‌గా గెలుపొందటంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరించేవారని గుర్తుచేసుకున్నారు. రాములుతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. జనసంఘ్ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. నల్లగొండలో దేవాలయ సమస్యను పరిష్కరించినట్లు ఆయన గుర్తుచేశారు. 1981లో నల్లగొండ మునిసిపల్ చైర్మన్‌బీజేపీ సొంతం చేసుకోవడంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాములు ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసి సఫలీకృతం కాకపోయినా, పార్టీ గ్రామ గ్రామాన విస్తరించాలన్న లక్ష్యంతో పని చేశారని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా నీరసపడకుండా పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేసినట్లు తెలిపారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీగా చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. అలాంటి వ్యక్తి ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నానని పేర్కొన్నారు. ఇదే క్రమంలో తన పాత మిత్రులను గుర్తు చేసుకున్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఓరుగంటి రాములు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, పోలీసు కేసులు వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను పరిష్కరించేవారన్నారు. ఈ సమావేశంలో ఓరుగంటి రాములు సతీమణి ధనలక్ష్మి, కుమారులు శ్రీనివాస్, వంశీ, మాధవప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, గార్లపాటి వెంకటయ్య, నన్నూరి రాంరెడ్డి, కర్నాటి విజయ్‌కుమార్, కల్లెం బాల్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, పెరిక మునికుమార్, ఎర్రమల్ల భాస్కర్, కూతురు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంతి పూల సాగు... భలే బాగు



కట్టంగూరు, సెప్టెంబరు 5: బంతిపూల సాగులో లాభాలు ఉండడంతో రైతులు అటు వైపు దృష్టి సారిస్తున్నారు. బంతి పూల సాగులో ఎంత పెట్టుబడి పెడతామో అదే స్థాయిలో లాభాలు వస్తుండడంతో నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన యువ రైతు ఎరుకల వేణు తనకున్న 10గుంటల వ్యవసాయ భూమిలో నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలను సాగు చేస్తున్నారు. భూమి సాగు, ఎరువులు, మొక్కలు, భూమి దున్నడం లాంటి వాటి కోసం సుమారు రూ.25వేలు ఖర్చు వస్తుందని వేణు తెలిపారు. రెండు నెలల పాటు(జూన్,జూలై) బంతి చెట్లను పెంచితే, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బంతిపూలు చేతికొస్తాయి. పండుగల సీజన్లో కేజీ రూ.150, సీజన్ లేనపుడు కేజీ రూ.100కు విక్రయిస్తున్నారు. వాతావరణం అనుకూలించి పూల సాగకు అనుకూలంగా వర్షాలు పడితే 10గంటల సాగుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు అందించవచ్చు వేణు తెలిపారు.

బంతిపూల సాగుతో లాభాలు

బంతిపూల సాగుతో లాభాలు పొందుతున్నాం. 10గుంటల భూమిలో బంతిపూల సాగు చేస్తే సుమారు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నాం. సీజన్‌లో బంతిపూలను కేజీ రూ.150, సీజన్ లేనప్పుడు కేజీ రూ.100కు విక్రయిస్తాం.

● ఎరుకల వేణు, యువరైతు రాంనగర్, కట్టంగూర్.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 5: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తిలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలోని మొక్కలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. తాగునీటి ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛదనం కార్యక్రమం పగడ్బందీగా చేపట్టాలని చెత్తాచెదారంను తొలగించాలని సూచించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చెత్తా చెదారం, నీటినిల్వలు లేకుండా సీజనల్ వ్యాధులకు కారణమవుతాయని పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రత అనారోగ్య సమస్యలను పారదోలవచ్చన్నారు. ఆయన వెంట చిట్యాల ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతున్నాయి. అండర్-11 బాలబాలికల పోటీలకు తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు నేషనల్స్‌లో స్థానం కోసం తలపతున్నారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ పర్యవేక్షిస్తున్నారు.

ఆపదలో ఉన్నవారు హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్‌చేయాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: మహిళలు, పిల్లలు ఆపత్కాలంలో హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098కు ఫోన్ చేసి రక్షణ పొందాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్సిల్ లిటరసీ మనిషా అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని తాతానగర్, ఎరుకల బస్తీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వంద రోజుల సంకల్ప్ కార్యకలాపాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, గృహ హింస తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, బాలమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 5: అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నేతాపురం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వృద్ధురాలైన కోరె లింగమ్మ కొన్నేళ్లుగా చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. గురువారం సాయంత్రం గ్రామంలో ఉన్న తన కుమార్తె బుచ్చమ్మ ఇంటి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకోవడంతో తగలబడుతుండగా స్థానికులు చూసి వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో లింగమ్మకు చెందిన వంట సామాను, ఇంట్లోని దుస్తులు, ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. వృద్ధురాలు లేని సమయంలో గుడిసె కాలిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బాబోయ్ దొంగలు

● తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆగంతకులు



చింతపల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ (మాల్)లో దొంగల బెడద తీవ్రమైంది. మండలం గొడకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని తాళం వేసిన ఇళ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరపడి చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఏ ఇంట్లో, వ్యాపార దుకాణంలో చోరీ జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి 25కిలోమీటర్ల దూరంగా ఉండటం వల్ల రాత్రి సమయంలో పోలీసులకు ప్రజలకు నిఘా ఏర్పాటు చేయాలంటే కొద్దిగా ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వరనగర్ ఉండటంవల్ల చోరీ చేసిన ఆగంతకులు రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్‌కు కలిసిపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

వీటీనగర్‌లో కనిపించని సీసీ కెమెరాలు

రెండు జిల్లాల కూడలి ప్రధాన వ్యాపార కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందుతున్న వెంకటేశ్వరనగర్(మాల్)లో గతంలో ఎస్పీ దుగ్గల్ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరిగిన వెంటనే సీసీ కెమెరాల సహాయంతో సమాచారం తెలుసుకునేవారు. ఇటీవల సాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారి వేంకటేశ్వరనగర్‌లో రోడ్డు వెడల్పు చేయడంతో సీసీ కెమెరాలు కనిపించకుండా పోయాయి. సకాలంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ జిల్లా నుంచి ఏ ప్రాంతం నుంచి దేనికోసం వస్తున్నారో గుర్తించడం క్లిష్టంగా మారింది.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లారా అంతే సంగతులు

వెంకటేశ్వరనగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ రఫీయా ఖాతున్ గస్టు 8వ తేదీన ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి చేరుకోని సరికి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలుకొట్టి 80 తులాల వెండి ఆభరణాలు, 3 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు.

● ఆగస్టు 22న గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మల్లోజు విష్ణుమూర్తి దేవరకొండలోని ఆర్టీసీ డిపోలో బస్సు మెకానిక్‌గా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే విధుల నిర్వహించడకోసం వెళ్లగా, భార్య ఇంటికి తాళాలు వేసుకొని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే సమయంలో దొంగలు ఎవరూ లేరని తెలుసుకొని తాళాలు పగలకొట్టి 12 తులాల వెండి ఆభరణాలను దోచుకువెళ్లారు.

● ప్రముఖ విశ్రాంత అధ్యాపకుడు చేపూరి బ్రహ్మచారి జగదాంబ వారి ఆస్పత్రికి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ నెల 8న ఎంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి వేళ్లలో దొంగలు ఇంట్లోకి చొరపడి 2 కిలోల వెండి ఆభరణాలు రూ. 5 వేల నగదును తీసుకెళ్లారని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తాం



వెంకటేశ్వరనగర్(మాల్)లో త్వరలో వ్యాపారస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వరనగర్‌లో పెట్రోలింగ్ ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాల కోసం ప్రజలతో సమావేశం నిర్వహించి వారి సహకారంతో నిఘా వ్యవస్థ పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేముందు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. గుర్తుతెలియని వ్యక్తులు తిరిగితే 100కు సమాచారం ఇవ్వాలి.

● యాదయ్య ఎస్ఐ, చింతపల్లి

జడ్పీలో కారుణ్య భర్తీలేవీ?

● ఏడు సంవత్సరాలుగా భర్తీకాని 150పోస్టులు
● కౌన్సిలింగ్‌కు ముందుకు రాని బాధిత కుటుంబాల సభ్యులు
● అటెండర్ పోస్టులు కావడమే వెనుకంజకు కారణం
● జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కోసం పట్టు

నల్లగొండ, సెప్టెంబరు 5: జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోంది. స్థానిక సంస్థల ఉద్యోగులు ఎవరైనా మరణించినా, ఆరోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేని పరిస్థితుల్లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా సదరు ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఈ విధానం అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా పరిషత్ పరిధిలో వివిధ సెక్షన్‌లలో 150పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరేడు సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీ కావడం లేదు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీరాజ్‌తో పాటు స్థానిక సంస్థల పరిధిలో ఎద్దైనా ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ మరణించిన, వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించడమే కారుణ్య నియామక లక్ష్యం. సదరు ఉద్యోగి మృతితో వారి కుటుంబాలు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతుంతారు. జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు కారుణ్య నియామకాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్ కాలంలో మరణిస్తే ఆ వ్యక్తి కుటుంబంలో భార్య, భర్తకు, కుమారుడికి, కూతురికి లేదంటే కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వారిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. వారి అర్హత ఆధారంగా మృతిచెందిన ఉద్యోగి తత్సమాన ర్యాంకు ప్రకారం అదేస్థాయిలో ఉద్యోగం లేదంటే తక్కువ స్థాయిలో ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగుల హక్కుతో పాటు సర్వీస్ నిబంధనలో కూడా ఉంది.



అటెండర్ పోస్టులే కారుణ్య నియామకాలకు ఆంటంకం

కారుణ్య నియామకాల భర్తీ నల్లగొండ జిల్లా పరిషత్‌లో కొనసాగుతున్నప్పటికినీ అవి అంతంతా మాత్రమే ఉంటున్నాయి. దీని ప్రధాన కారణం అటెండర్ పోస్టులు మాత్రమే 150పోస్టులు ఉండటం తప్ప ఉన్నత పోస్టులు లేకుండా పోయాయి. అటెండర్ పోస్టుల పట్ల(ఆఫీస్ సబార్డినేట్) మృతిచెందిన కుటుంబ సభ్యుల పిల్లలు లేదంటే ఇతర పెద్దలు విముకత చూపిస్తూ ముందుకు రావడం లేదు. మండల పరిషత్, ఇతర స్థానిక సంస్థల్లో సబార్డినేట్ ఉద్యోగాలు తప్ప మిగతా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నుంచి ఈ నియామకాలు అరకొరగా సాగుతున్నాయి. ఈ ఉద్యోగాలకు సంబంధించి అంటెండర్ పోస్టులోనే నియామక ప్రక్రియ చేపట్టడంతో డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్‌తో పాటు కాస్తా ఆర్థికంగా ఉన్న బాధిత కుటుంబాల పిల్లలు లేదంటే వారి కుటుంబ సభ్యులు అంటెండర్ పోస్టులు కాకుండా జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కోరుకోవడం మూలంగా జిల్లాలో నియామకాల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కోరుకుంటుండంతో కారుణ్య నియామకాల పోస్టులు భర్తీ కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 61ఏళ్లకు పెంచడంతో గతంలో మాదిరిగా ఖాళీలు కూడా ఏర్పడటం లేదు. కారుణ్య నియామకాల్లో డిగ్రీ అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, తెలుగు, ఇంగ్లీష్ హాయ్యర్ ఉత్తీర్ణత ఉన్నవారికి టైపిస్టు ఉద్యోగాలు, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇస్తారు. జిల్లాలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారిలో అత్యధికంగా ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఉండటం వారు కోరుకున్న విధంగా పోస్టులు లేకపోవడం సమస్యగా మారింది. కొంతమంది డిగ్రీ పూర్తి చేసే దశలో పిల్లలు సైతం తమకు అటెండర్ బదులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టు కావాలంటూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఆర్జీ పెట్టుకున్నారు.

పైస్థాయి కేటగిరి ఖాళీలపై దృష్టి సారించని ప్రభుత్వం

ప్రతి ప్రభుత్వ శాఖలోను అటెండర్ పోస్టులను మాత్రమే కారుణ్య నియామకాల కోసం ఖాళీలు చూపిస్తున్న ప్రభుత్వం సబార్డినేట్ పై స్థాయి ఖాళీలను మాత్రం ఖాళీలుగా చూపించకపోవడంతో జిల్లా పరిషత్ పరిధిలో పోస్టుల భర్తీకి తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా పరిషత్ అధికారులు ఈ ఆరేడు సంవత్సరాలుగా కారుణ్య నియామకాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇస్తూ కౌన్సిలింగ్‌కు ఆహ్వానిస్తున్నా వచ్చిన బాధిత కుటుంబ వారసుడు తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టు క్యాడర్ కలిగిన ఉద్యోగం ఇస్తేనే జాయిన్ అవుతామంటున్నారు. ఉన్నత చదువులు చదివి అటెండర్ పోస్టులో జాయిన్ అయితే పదోన్నతి వచ్చే వరకు ఏళ్ల సమయం పడుతుందని, సగం సర్వీస్ పూర్తి అవుతుందన్నా ఆలోచనతోనే అటెండర్ పోస్టులో బాధ్యతలు తీసుకోవడానికి వారసులు వెనకంజ వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కారుణ్య నియామకాల భర్తీ కోసం ఏ విధమైన ఆలోచన చేస్తుదనే దానిపై ఎదురు చూస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఇతర పై క్యాటగిరి పోస్టులను భర్తీ చేస్తారా లేదా అనేది చర్చ సాగుతోంది. జిల్లా పరిషత్‌లో 2018 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. జడ్పీ కార్యాల యంలో వివిధ హోదాలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలు, అటు కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి ఓ వైపు కోరుతునే మరోవైపు అటెండర్ పోస్టులకు బదులుగా ఉన్నత పోస్టులను కోరుతుండడంతో పెండింగ్ పడుతోంది.

కౌన్సిలింగ్‌కు పిలిచినా ముందుకు రావడం లేదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీకి అనేక సార్లు నిర్ణయం తీసుకున్నాం. కౌన్సిలింగ్‌కు పిలిచిన కూడా ముందుకు రావడం లేదు. అటెండర్ పోస్టుల పట్ల వారు విముఖత చూపుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు అటెండర్ పోస్టులల్లో జాయిన్ కావడం లేదు. దీంతోనే చాలా కాలంగా కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో చేపట్ట లేకపోయాం. చనిపోయిన వారి వారసులు ఖాళీగా ఉన్న పోస్టుల్లో జాయిన్ కావడానికి ముందుకు వస్తే నియామకాలను వెంటనే చేపడతాం.

● ప్రేమ్‌కరణ్ రెడ్డి, జడ్పీ సీఈవో, నల్లగొండ

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



తిప్పర్తి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన ఓర్సు వెంకటయ్య రెండో సంతానం రూపాని అరుణ(28) భర్తకు దూరంగా ఉంటూ తనకు ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో ఉంచి తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో ఐదు నెలలుగా గదిని అద్దెకు తీసుకొని నివాసముంటుంది. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన అరుణ తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన తండ్రి వెతకగా ఆచూకీ లభించలేదు. తన కూమార్తె అదృశ్యంపై చిట్యాల మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన రూపాని అనిల్‌పై అనుమానం ఉందని అరుణ తండ్రి ఓర్సు వెంకటయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 5: బైక్ దొంగతనం కేసులో చౌటుప్పల్ మెజిస్ట్రేట్ వైష్ణవి మహతి ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించినట్లు సీఐ మన్మథరావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా ఆత్మకూర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బద్దుల అనిల్, మోత్కూర్ మండలం శదర్శనపురం గ్రామానికి చెందిన బత్తిని స్వాతి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆరు నెలల క్రితం బైక్‌ను చోరీ చేశారు. ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకొని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ ఖాజా నిజామోద్దీన్ కేసును వాదించారు.

వరకట్నం వేధింపుల కేసులో జైలు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 5: అదనపు వరకట్నం వేధింపుల కేసులో జైలు శిక్ష పడి తప్పించుకు తిరుగుతున్న భర్తను పోలీసులు అరెస్టు చేసిన ల్లగొండ జైలుకు పంపించారు. సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కాశమోని గోపాల్(32) తంగడపల్లికి చెందిన మహిళను 2016లో వివాహం చేసుకున్నాడు. పెళ్లి సందర్భంగా తల్లితండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లి తర్వాత భర్త గోపాల్ భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశాడు. భార్య భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేసి భర్తను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడు భువనగిరి కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాగా కింది కోర్టు తీర్పునే అమలు చేయాలని మెజిస్ట్రేట్ తీర్పునిచారు. అప్పటి నుంచి నిందితుడు తప్పించుకొని తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించారు.

టెంకాయల విక్రయ వేలం రూ.60.60లక్షలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే టెంకాయల విక్రయవేలం రూ.60.60 లక్షలకు పాడారు. ఏడాది కాలపరిమితికి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలంలో తొమ్మిది మంది వేలందారులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిక్కుళ్ల శ్రీనివాస్ రూ.606.0లక్షల అధికంగా పాడి కొబ్బరికాయల వేలం విక్రయ హక్కును దక్కించుకున్నారు. రెండో వేలందారుడైన కల్లూరి శ్రీనివాస రూ.60.50లక్షలకు వేలం పాడినట్లు గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్ మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, చెర్వుగట్టు మాజీ ఛైర్మన్ నల్ల వెంకన్న పాల్గొన్నారు.

స్వల్ప వాగ్వాదం

గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో కొంత వాగ్వాదం జరిగింది. గ్రామ పంచాయతీకి కొబ్బరికాయల వేలం హక్కుదారులు చెల్లించాల్సిన బకాయిలపై దుమారం రేగింది. వేలం డబ్బుల విషయంలో అవినీతి జరుగుతుందంటూ గ్రామస్థులు కొందరు అధికారులను నిలదీశారు. ఆధారాలుంటే చూపించి మాట్లాడాలని అధికారులు ఇచ్చిన సమాధానంతో కొందరు ఆగ్రహం చెందారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచా రాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహిం చారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,10,624ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ కోదండరాం సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం అందజేశారు.

'పేట'లో రెండు కిలోల గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తరలించి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సూర్యాపేట డీఎస్పీ జి. రవి వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురైనగర్‌కు చెందిన భోగ చరణ్, జేజేనగర్‌కు చెందిన అతని స్నేహితుడు చిలకరాజు సందీప్ కలిసి నాలుగు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద రూ. 5వేలు చొప్పున రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి గంజాయి సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఇతరులకు విక్రయించేందుకు పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలో వేచి ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేసి గంజాయితో పాటు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, పట్టణ ఎస్ఐ లోకేష్ కుమార్, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, శ్రీరాములు, జోగు సైదులు, చీకూరి మధు ఉన్నారపాఒ

పగలంతా రెక్కీ.. రాత్రి ఇళ్లలో దొంగతనాలు



రికవరీ చేసిన నగలను, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కొండాపూర్, సెప్టెంబరు 5:పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రి వేళలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని సంగారెడ్డి జిల్లాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండాపూర్ సీఐ చంద్రయ్య గురువారం వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు(30) తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. జల్సాలకు, తాగుడుకు బానిసై ఇళ్ల, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి మల్కాపూర్ చౌరస్తాలో కొండాపూర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానంగా కన్పించిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించారు. 30ఇళ్ల చోరీల్లో 39.4 తులాల బంగారు ఆభరణాలు, 188తులాల వెండి, రూ.9.50లక్షల నగదు, రెండు బైకులను అపహరించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ వాడకుండా ఎటువంటి సామగ్రి తీసుకెళ్లకుండా ఒంటరిగా వెళ్లి ఇంటి ఆవరణలో ఉండే ఇనుపరాడ్లు, రాళ్లతో తాళాలను పగులగొట్టి అపహరించేవాడు. నిందితుడిపై మెదక్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, వికారాబాద్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కొండాపూర్, సీసీఎస్ పోలీసులకు సీఐ రివార్డులు అందజేశారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మేళ్లచెర్వు, సెప్టెంబరు 5: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని వేపలమాదారం గ్రామంలో 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వేపలమాదారం గ్రామానికి చెందిన నాగులమీరా ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఓ షెడ్డులో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 13 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నాగుల్‌మీరాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీజ్ చేసిన మద్యం బాటిళ్లు ధ్వంసం



సూర్యాపేటలో మద్యం బాటిళ్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: సూర్యాపేట పట్టణంలో కొంత కాలంగా వివిధ కేసుల్లో సీజ్ మద్యాన్ని గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. కొంత కాలంగా పట్టణంలో నమోదైన 72 కేసులకు సంబంధించిన రూ.2.5లక్షల విలువ చేసే వివిధ రకాల బ్రాండ్ల మద్యాన్ని నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో ఈఎస్ లక్మానాయక్, పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, ఎస్ఐలు లోకేష్‌కుమార్, బాల్నె కుశలవ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనం ఢీకొని 11గొర్రెలు మృత్యువాత



గొర్రెల కళేబరాలు

పెద్దవూర, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పోతునూరు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-167పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11గొర్రెలు మృతిచెందాయి. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా ఇమాంపేటకు చెందిన నగిరే గంగరాజుతో మరో ఐదుగురికి చెందిన జీవాలు నల్లగొండ జిల్లా పెద్దవూర సమీపంలోని పలు గ్రామాల్లో మేతమేపుకొని పోతునూరు వైపు వెళ్తుండగా మల్లెపల్లి నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వస్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 11గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరికొన్ని గొర్రెలు గాయలపాలయ్యాయి. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదుపై దర్యాప్తు నమోదు చేఉసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.70 అడుగులు



నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు(312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 587.80 అడుగులుగా(305.9818టీఎంసీలుగా) ఉంది సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 96,399 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885అడుగులు(215.8070టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 884.80 అడుగులుగా (213.8878టీఎంసీలుగా) ఉంది. శ్రీశైలం ఒక క్రస్ట్ గేటును 10అడుగుల మేరకు ఎత్తి 27,937 క్యూసెక్కుల నీటిని, శ్రీశైలం కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 30,708 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 95,761 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.80 అడుగులు (305.9818టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8529 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 40,405 నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 95,761 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

నిలకడగా పులిచింతల వరద

మేళ్లచెర్వు: పులిచింతలకు ఎగువ నుంచి స్వల్పంగా 57,428 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6,41,250 క్యూసెక్కులుగా నమోదైన వరద నీరు సోమవారం సాయంత్రానికి 5,48,050 క్యూసెక్కులుగా నమోదు కాగా మంగళవారం సాయంత్రానికి 4,07,855 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళవారం రాత్రి 11 గంటలకు ఒక్కసారిగా లక్ష క్యూసెక్కులకు తగ్గిన వరద బుధవారం సాయంత్రానికి 20వేల క్యూసెక్కులుగా నమోదైంది. గురువారం 50వేల క్యూసెక్కులు నమోదు కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు. (45.77) టీఎంసీలు కాగా, 173.78అడుగులు. (43.88 టీఎంసీలుగా) నమోదు కాగా తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్లను విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా ప్రాజెక్టు మొత్తం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 57,482 క్యూసెక్కులుగా నమోదైంది.

ఏడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లో గల మూసీ ప్రాజెక్టుకు ఐదు రోజులుగా వరద కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆలేరు, బిక్కేరులతో పాటు చిన్నాచితక వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు వరద నీటిరాకడ భారీగానే ఉంటుంది. ఐదు రోజుల నుంచి ప్రాజెక్టుకు పెరిగిన వరద తాకిడి గురువారం సైతం కొనసాగింది. మంగళ, బుధవారాల్లో ప్రాజెక్టు ఏడు క్రస్టుగేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి ఎగువ నుంచి వస్తున్న వరదకు మించి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం రెండు గేట్లు తగ్గించి ఐదు గేట్లను ఎత్తి 12,111క్యూసెక్కుల వరద నీటిని విడుదుల చేస్తున్నారు. మరోవైపు 641అడుగులకు పడిపోయిన ప్రాజెక్టు నీటిమట్టాన్ని గరిష్ట స్థాయికి చేర్చే చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 8,773క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులుకాగా గురువారం సాయంత్రానికి నీటిమట్టం 641.30అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలకుగాను ప్రస్తుతం 3.52టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి భారీగా నీటిని వదులుతున్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా : బాలునాయక్


పీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, సెప్టెంబరు 5: చందంపేట మండలాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని హంక్యతండా నుంచి కంభాలపల్లి వరకు రూ.2.25కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పిస్తానని, మండలంలోని గ్రామాలకు సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, లోకసాని మన్మధరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5: సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, మోర్చాల సభ్యులు చురుగ్గా పాల్గొనాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలంగా సుపరిపాలన అందస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు యువత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కనపర్తి స్వతప్రసాద్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆదివాసీ మహిళపై జరిగిన దాడి అమానుషమని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత అన్నారు. ఆసీఫాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, అశోక్‌రెడ్డి, భాగ్యమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : బీఎల్ఆర్


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 5: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అత్యవసర సమయంలో కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తోందని అన్నారు. ఆలగడప, సుబ్బారెడ్డిగూడెం, రాయినిపాలెం, బాదలాపురం, వెంకటాద్రిపాలెం, కిష్టాపురం, గూడూరు, కొత్తగూడెం గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, నాయకులు తలకొప్పుల సైదులు, ఎంపీపీ జిందా, శంకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మంద సైదులు, మాధవి, ఈపూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

త్రిపురారం: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 53మంది లబ్ధిదారులకు రూ.16లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భారతి భాస్కర్‌నాయక్, నాయకులు బిట్టు రవికుమార్, చిలుముల శ్రీను, మర్ల చంద్రారెడ్డి, అల్లంపల్లి జానయ్య, చలమల్ల అమరేందర్‌రెడ్డి, సైదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ దీప ఊరేగింపు ఉత్సవం


అఖండ దీపాన్ని ఆలయంలోకి చేర్చిన గ్రామస్థులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5: మండలంలోని శాపల్లిలో 41 రోజుల క్రితం ప్రారంభమైన అఖండం దీప ఊరేగింపు ఉత్సవం గురువారంతో ముగిసింది. పాడి పంటలు పండాలని, గ్రామస్తులంతా ఆరోగ్యంగా ఉండాలనే కోరికతో శాపల్లిలో వందేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే జూలై 27వ తేదీన ప్రారంభమైన అంఖడం మండలం రోజులు పూర్తిచేసుకుని స్వామి వారి అఖండ దీపాన్ని గర్భాలయంలోకి చేర్చడంతో అఖండం ముగిసింది. ఈ వేడుకల్లో గ్రామస్తులు పాల్గొన్నారు. దీక్ష చేపట్టిన వ్యక్తితో ప్రత్యేక పూజలనంతరం అఖండ దీపాన్ని ఆలయంలోకి చేర్చిన అనంతరం ప్రసాద వితరణ గావించారు.

టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

నిడమనూరు, సెప్టెంబరు 5: టీపీఆర్టీయూ నిడమనూరు మండల అధ్యక్షుడిగా పాంపాటి శ్రీనివాస్‌ను ఎనిమిదోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాంపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మంత్రాల సురేందర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కోటయ్య, ఉపాధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి ఏ.కోటయ్య, మహిళా కార్యదర్శి మమత, ఉపాధ్యాక్షురాలిగా లీలావతి ఎన్నికయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడు పాంపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.


తిప్పర్తి : సుశీలను సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు


హెచ్‌ఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి తదితరులు


హాలియా: అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న టీచర్లు


ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకుంటున్న రఘుపతి

గురువును మించిన దైవం లేదు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): గురువును మించిన దైవం లేదని పలువురు పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు, పాఠశాల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



సాగర్: కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు


గట్టుప్పల్: వెల్మకన్నె గ్రామంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు


పెద్దవూర : టీచర్లను సన్మానిస్తున్న హెచ్‌ఎం వెంకట్‌రామ్‌నాయక్



చండూరు: డాన్‌బోస్కో, కళాశాల, సన్‌షైన్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు


మిర్యాలగూడలో మాట్లాడుతున్న రమేష్


కొండమల్లేపల్లి: ఉపాధ్యాయునితో విద్యార్థులు


నార్కట్‌పల్లి: అధ్యాపకులను సన్మానించిన నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు


కనగల్: చినమాదారంలో ఉపాధ్యాయులకు సన్మానం


హాలియా : సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు


శాలిగౌరారం: జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న సైదులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సావర్కర్‌నగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

నల్లగొండ, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ రాపోలు వెంకటేశ్వర్లు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాఖ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల విజిట్‌లో భాగంగా గురువారం సావర్కర్ నగర్‌లోని ఎస్సీ హాస్టల్‌ను సిబ్బందితో కలిసి విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీవో భైరబోయిన భిక్షం, ఏఎన్ఎం ఎస్.శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ తరాల సురేష్, ఆశా వర్కర్లు శైలజ, నాగమణి, రాణి, పద్మ, హాస్టల్ వార్డెన్లు స్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జ్యోతిలక్ష్మి కోరారు. మండలంలోని వల్లాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరణను తనిఖీ చేశారు. ఉపాధిహామీలో రోడ్ల వెంట నాటుతున్న మొక్కలను పరిశీలించి వాటికి రక్షణగా కంచె నాటాలని ఆమె సూచించారు.

మండపాల వద్ద నిబంధనలు పాటించాలి


నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, కేతేపల్లి, దామరచర్ల, శాలిగౌరారం, సెప్టెంబరు 5: రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వన్‌టౌన్ పీఎస్ పరిధిలో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న వారికి గురువారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో పలు సూచలను చేశారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మండపాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులే బాధ్యత వహించాలన్నారు. ప్రతి విగ్రహం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, పాత నేరస్థులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా పెడతామని ఆయన అన్నారు. సమావేశంలో ఎస్ఐలు శంకర్, జూకూరి సైదులు, సందీప్‌రెడ్డి, సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: గణేష్ నవరాత్రులను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ శివతేజ సూచించారు. నిబంధనలకు అతిక్రమించి వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

● **శాలిగౌరారం:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ డి.సైదులు కోరారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతిసంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్‌శాఖ అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్‌లో ఉన్న 32 నిబంధనలను పూర్తి చేసిన వారికే వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నల్లగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి



నూతనంగా ఎన్నికైన నల్లగొండ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, (ఇన్‌సెట్‌లో) మహేందర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 5: నల్లగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా నూతన అధ్యక్షుడిగా పులిమామిడి మహేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సీనియర్ జర్నలిస్టు ఫహీమోద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షుడిగా పులిమామిడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాదె రమేష్, శాశ్వత గౌరవ అధ్యక్షులు గా ఫహీమోద్దీన్, గౌరవ సలహాదారులుగా కోటగిరి దైవాదీనం, గార్లపాటి కృష్ణారెడ్డి, గుండగోని జయశంకర్, ఏచూరి భాస్కర్, ఉపాధ్యక్షులుగా శేషు, కిరణ్‌రెడ్డి, కోటగిరి రామకృష్ణ, రవిశంకర్, అశ్వాక్ అహ్మద్, రెడ్డిపల్లి యాదగిరి, జూలకంటి అశోక్‌రెడ్డి, కార్యదర్శులుగా జిల్లా యాదయ్య, శివప్రసాద్, శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీ నివాస్‌రెడ్డి, పాలకూరి శేఖర్, కంది వేణు, భాస్కర్, ప్రచార కార్యదర్శిగా ఉబ్బని సైదులు, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశానికి హాజరైన టీయూడబ్ల్యూజే టీజేఎఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి చల్లా సాంబశివరెడ్డి, సాక్షి బ్యూరో గణేష్, ఐబీసీఎండీ ఏచూరి భాస్కర్, సిటీకేబుల్ ఎండీ దుర్గాప్రసాద్, రాజు హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణంతో పాటు పలు అంశాలను చర్చించారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం: ఆర్డీవో


నేరేడుగొమ్ములో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరాములు

చందంపేట, సెప్టెంబరు 5: మండలంలోని భూ సమస్యలను పరిష్కరిస్తామని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు అన్నారు. నేరేడుగొమ్ము రైతువేదికలో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నెంబర్ 630 భూసమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ సతీష్, డీటీ అయూబ్, రైతులు పాల్గొన్నారు.

చిన్నఅడిశర్లపల్లిలో సామాజిక తనిఖీ

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారు. జిల్లా ఆడిట్ అధికారి సుమానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో చేపట్టిన ప్లాంటేషన్, శానిటేషన్‌పై క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం వన నర్సరీలను, గ్రామపంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామంలో దోమల మందును పిచికారీ చేసే నూతన యంత్రం కొనుగోలుకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఆయన వెంట ఎండీ హఫీజ్, ఎంపీడీవో రాంరెడ్డి, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి సరస్వతి తదితరులు ఉన్నారు.

దేవరకొండలో ముసురుతో కూడిన వర్షం


దేవరకొండలో కురుస్తున్న వర్షం

దేవరకొండ, సెప్టెంబరు 5: దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో గురువారం సాయంత్రం ముసురుతో కూడిన వర్షం కురిసింది. దేవరకొండ పట్టణంలో వర్షానికి ప్రధానవీధులు జలమయమయ్యాయి. ఇటీవల దేవరకొండ డివిజన్‌లో తుఫాన్ ఏర్పడటంతో భారీ వర్షం కురిసింది. డిండి ప్రాజెక్టు పూర్తిగా నిండింది. దుందుభినది ఎగువభాగాన భారీ వర్షాలు కురుస్తుండటంతో వరదనీరు నక్కలగండి రిజర్వాయర్‌లోకి చేరుకుంటుంది. నక్కలగండి రిజర్వాయర్‌కు చేరుకున్న నీటిని నీటిపారుదలశాఖ అధికారులు దిగువ భాగానికి విడుదల చేస్తున్నారు. మళ్లీ మూడు రోజులతరువాత ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. దేవరకొండతో పాటు కొండమల్లేపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలో ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది.

మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

దామరచర్ల, సెప్టెంబర్ 5: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోటార్ సైకిల్ పోరుయాత్ర గురువారం దామరచర్ల మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారని, 9 నెలలు గడుస్తున్నా మెస్ చార్జీలు విడుదల కాలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ధీరావత్ శ్రీను, కావ్య, లక్ష్మణ్‌నాయక్, కుర్ర సైదా, వెంకటేష్, రమేష్, రవీందర్, వీరన్న పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడేందుకే మట్టి విగ్రహాల పంపిణీ


శ్రీచరణ్

గట్టుప్పల్, సెప్టెంబరు 5: పర్యావరణాన్ని కాపాడేందుకు కస్తూరి ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కస్తూరి ఫౌండేషన్ తరఫున 8 వేల మట్టి విగ్రహాలతో పాటు జ్యూట్ బ్యాగులు, పూజ పుస్తకాలను శుక్రవారం, శనివారం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐదేళ్లుగా ప్రతి ఏడాది పది వేల విగ్రహాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

మట్టి గణపతులనే పూజించాలి

చిట్యాల: అందరూ మట్టి గణపతులనే పూజించాలని మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. చిట్యాల మునిసిపల్ కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతులు పర్యావరణ హితమన్నారు. యువత మట్టి గణపతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ కూరెల్ల లింగస్వామి, కమిషనర్ వీరేందర్, కౌన్సిలర్లు రెమిడాల లింగస్వామి, కోనేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

వేములపల్లి: ప్రజా సమస్య పరిష్కారమే ఎజెండాగా ప్రతీ కార్యకర్త ప్రజా చైతన్య పోరాటాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొల్కపట్నం గ్రామంలో సీనియర్ నాయకుడు నెమ్మోజు శ్రీశైలంచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలని, అదేవిధంగా రుణమాఫీ అర్హత ఉండి రుణమాఫీ పొందని వివరాలను సేకరించి వారికి వెంటనే లబ్ధి చేకూర్చాలని అన్నారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడిగా రెమడాల బిక్షంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బొమ్మగాని ఎల్లయ్య, వల్లమల్ల ఎల్లయ్య, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులు కార్యాలయంలో సంప్రదించాలి

మిర్యాలగూడ టౌన్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు కార్యాలయంలో సంప్రదించాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ అన్నారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి పొందని లేఅవుట్లలో ప్లాట్లు కొని 2020 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న యజమానులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారులు ఎలాంటి సంక్షిప్త సమాచారం అందకున్నా వారు స్పందించాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

మిర్యాలగూడ టౌన్: విశ్వాస పరిచర్య ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపకుడు హన్యానాయక్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు, దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమాబాయి, రమేష్, ఆశీర్వాదం, రూత్, సురేష్, గీత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

మునుగోడు: మునుగోడు నియోజకవర్గం పరిధిలోని చర్లగూడెం, శివన్నగూడెం ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతంలో సాగు నీటి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు కోరారు. డీపీఆర్ ఆమోదంతో పాటు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రైతులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాసరాణి శ్రీను, సాగర్ల మల్లేష్, లింగస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

కనగల్: ప్రైవేట్ ఎలక్ట్రీషన్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఎలక్ట్రీషన్ల సంఘం మండల అధ్యక్షుడు మండలి పరమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఎలక్ట్రీషన్ సంఘం సభ్యులు తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పరమేష్‌యాదవ్ మాట్లాడుతూ ఎలక్ట్రీషన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషన్ సంఘం సభ్యులు శ్రీకాంత్, విజయ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన

చింతపల్లి: చింతపల్లి మండలంలోని హోమంతాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, టీచర్ పద్మావతి పాల్గొన్నారు

సుంకిశాలతండాలో భూ సమస్యలను పరిష్కరించాలి

తిరుమలగిరి(సాగర్): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురైన మండలంలోని సుంకిశాలతండా వాసుల భూమి సమస్యలను పరిష్కరించాలని పలువురు గ్రామస్థులు కోరారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తమ తండా ముంపునకు గురికాగా అప్పటి ప్రభుత్వం 1958లో తండావాసులకు ప్రస్తుతం ఉంటున్న గుట్టపై పునరావాసం కల్పించింది. అప్పటి ప్రభుత్వం మాకు సర్వే నెంబర్లు 67, 255లో డిఫారెస్ట్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. పట్టాలు ఇచ్చిన వారికి ఆన్‌లైన్‌లో 1బీ రాకపోవడంతో ప్రభుత్వం నుంచి పథకాలు, బ్యాంకుల రుణాలు రావడం లేదని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సుంకిశాలతండాలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించి పట్టాలు వచ్చే విధంగా కృషి చేయాలని, అదేవిధంగా గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జబ్బార్‌నాయక్, బీమా, సోము, నగేష్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

6 మాసాల వరకు తల్లిపాలు తాగించాలి

నార్కట్‌పల్లి: పుట్టిన శిశువులకు ఆరుమాసాల వరకు తల్లి పాలనే తాగించాలని ఐసీడీఎస్ సీడీపీవో అస్రా అంజుమ్, సూపర్‌వైజర్ సరిత, అంజమ్మ అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని అక్కెనపల్లి, నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. పోషకాలు ఉన్న ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినాలని అన్నారు. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు ప్రభావతి, పద్మ, అనిత, హైమ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

చండూరు రూరల్: పౌష్టికాహారంతోనే పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మండలంలోని ఇడికూడలో నిర్వహించిన ఆమె మాట్లాడారు.